
క్లుప్తంగా

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి



శాంతినగర్: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, నిరుపేదలకు ఉన్నత విద్య అందించేందుకు కృషిచేయాలని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళిని శాంతినగర్ సేవాసమితి సభ్యుడు షేక్ అస్లాం షరీఫ్ కోరారు. జిల్లా పర్యటనకు వచ్చిన విద్యా కమిషన్ చైర్మన్‌ను షేక్ అస్లాం షరీఫ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానికంగా విద్యారంగంలో నెలకొన్న సమస్యలను చైర్మన్‌కు విన్నవించారు. అనంతరం తాను రచించిన నవ్వులే నవ్వులు జోక్స్ పుస్తకాన్ని చైర్మన్‌కు అందజేశారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

అయిజ: మండల కేంద్రంలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో కేటీదొడ్డి ఫీడర్‌కు సంబంధించిన 33 కేవీ ఫీడర్‌కు మరమ్మతు నిర్వహించేందుకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ నరేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఉత్తనూరులోని 33/11 కేవీలో, మండలంలోని చిన్నతాండ్రపాడు, తొత్తినోని దొడ్డి సబ్‌స్టేషన్లతో పాటు గట్టు మండలంలోని ఇందువాసి సబ్‌స్టేషన్‌లో ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. దానివలన అయిజ మండలంలోని ఉత్తనూరు భూంపురం, ఈడిగోనిపల్లి, సంకాపురం, చిన్నతాండ్రపాడు, కేశవరం, వేణిసోంపురం, మేడికొండ, తుపత్రాల, తొత్తినోనిదొడ్డి, పులికల్, బైనిపల్లి, సింధనూరు, కిసాన్‌నగర్, రాజాపురం, మూగోనిపల్లి గ్రామాలతో పాటు గట్టు మండలంలోని ఇందువాసి, బోయలగూడెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ధరూరు సబ్‌స్టేషన్ పరిధిలో..

ధరూరు: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాల్లో ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ కోతలు విధిస్తున్నట్లు మండల ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుకు గురయిన విద్యుత్ స్తంభాలు, ఏబీ స్విచ్‌లు మార్చడం వంటి పనులు చేపడుతున్నట్లు వారు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ధరూరు, జాంపల్లి, బూరెడ్డిపల్లి, దోర్నాల, కాపులకుంట తదిరత గ్రామాల్లో కోతలు ఉంటున్నట్లు వారు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని వారు కోరారు.

'కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేస్తాం'

అయిజ: కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చకుంటే ప్రభుత్వంపై పోరాటం చేస్తామని బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్వీ నాయకులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మహిళలకు, రైతులకు ఇచ్చిన హామీలు సైతం గాలికొదిలారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వంతో పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భరత్ బాబు, ఖాజావలి, సోమశేఖర్ నాయుడు, రాజు, మైబు, పరుశరాముడు, రామ్ కుమార్, రవితేజ, ఖాజా, మధు, ప్రవీణ్, రవి, ప్రకాష్; రంజిత్, విజయ సూర్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత



ఉండవెల్లి: మండలంలోని జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న ఇసుక లారీని అక్రమంగా వెల్దుర్తి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా బ్లూకోర్టు పోలీసులు పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. శనివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బ్లూకోర్టు పోలీసులు వాహన తనఖీల్లో అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని ఎలాంటి అనుమతులు లేకుండా ప్రయాణిస్తుండగా ఇటిక్యాలపాడు శివారులోని ఘర్‌డాబా వద్ద జాతీయ రహదారిపై పట్టుకుని లారీ డ్రైవర్ శ్రీనుపై ఏఎస్ఐ సుబ్బారెడ్డి కేసు నమోదు చేసి సీజ్ చేసినట్లు తెలిపారు.

మార్మోగిన గోవింద నామస్మరణ



ఆలయ ఆవరణలో భక్తుల సందడి



రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

కేటీదొడ్డి: పాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కనులపండువగా కొనసాగుతున్నాయి. మండలంలోని వెంకటాపురంలో వెలసిన స్వామి వారిని దర్శించుకునేందుకు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం, పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం ఏర్పడకుండా ఆలయ నిర్వాహకులు ముందస్తుగా చర్యలు తీసుకున్నారు. జాతర సందర్భంగా తినుబండరాలు మాంసం, వస్తు సామగ్రి ఆటబొమ్మలు, రంగులరాట్నం తదితర దుకాణాలు వెలిశాయి. చిన్నారులు ఆట వస్తువులు కొనుగోలు చేస్తూ సందడి చేశారు. జాతరలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

హంస వాహనంపై ఊరేగిన శ్రీవారు

మండలంలోని వెంకటాపురంలో వెలసిన పాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారిని హంస వాహన రథోత్సవంపై ఊరేగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి రథోత్సవాన్ని లాగారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం దీపావళి పండుగ సందర్భంగా మండలంలోని నందిన్నెలోని కమ్మిడిస్వామి రథోత్సవంలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ కుర్వ నల్లహనుమంతు, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాజశేఖర్, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, వైస్‌ఎంపీపీ రామకృష్ణనాయుడు, ఉరుకుందు, చక్రదర్, టీచర్ గోవిందు, నవీన్, గోపి, రాజేష్, శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేద్దాం



మాట్లాడుతున్న బలిగేరా శివారెడ్డి

మల్దకల్: బీజేపీ పటిష్టతకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని బీజేపీ జిల్లా నాయకుడు బలిగేరా శివారెడ్డి అన్నారు. శనివారం మల్దకల్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియచేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్వాయి రాముడు, మల్లెందొడ్డి వెంకటేశ్వరరెడ్డి, దామ నాగరాజు, దామ వెంకటేష్, రెడ్డప్ప, గోపాల్‌రెడ్డి, దర్శెల్లి తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల దినోత్సవాన్ని విజయవంతం చేయండి

అయిజ: విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని మండల కేంద్రంలోని ఏడీఈ కార్యాలయం ఆవరణలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు ఏడీఈ నీలి గోవిందు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారుల సదస్సుకు సబ్ డివిజన్ పరిధిలోని అయిజ, గట్టు, మల్దకల్, రాజోళి మండలాలకు సంబంధించిన విద్యుత్ ఏఈలు హాజరవుతారని తెలిపారు. ఆయా మండలాల విద్యుత్ వినియోగదారులు సదస్సుకు హాజరై వారి వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

జాతీయ క్రీడలకు పుల్లూరు విద్యార్థి



జాతీయ స్థాయికి ఎంపికైన మధుప్రియను సన్మానిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్

అలంపూర్: ఉండవెల్లి మండలం పుల్లూరు గ్రామానికి చెందిన సోమేశ్వరి, నాగార్జున్ దంపతుల కుమార్తె మధుప్రియ గట్టు మండలంలోని ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఎస్‌జీఎఫ్ అండర్–17 బాలికల విభాగంలో అక్టోబర్ 19వ మహబూబ్‌నగర్ జిల్లాలోని వేములలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. పెద్దపల్లి జిల్లా గోదారిఖనిలో అక్టోబర్‌లో 28 నుంచి 30 వరకు రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో 3వ స్థానం దక్కించుకుంది. దీంతో ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్ బలేరిలో జరిగే 68వ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థిని మధుప్రియను, తల్లిదండ్రులు సోమేశ్వరి, నాగార్జున్‌లను జిల్లా విద్యా శాఖ అధికారి రవీందర్ శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జితేందర్, ప్రిన్సిపల్ శోభారాణి, వైస్ ప్రిన్సిపల్ అనూష, పీఈటీలు సునీత, ప్రియాంక, కోచ్‌లు సింధురాణి, సతీష్ తదితరులు ఉన్నారు.

విజేతలకు నగదు అందజేత



ధరూరు: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ధరూరులో నిర్వహించిన సందెరాళ్ల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి నగదు బహుమతులు అందజేశారు. స్థానిక కుర్వ వీధిలో నిర్వహించిన పోటీల్లో ఆయా గ్రామాల నుంచి ఔత్సాహికులు హాజరై పోటీల్లో పాల్గొన్నారు. మండల కాంగ్రెస్ నాయకులు కుర్వ శ్రీనివాసులు మొదటి బహుమతిగా విజేతకు రూ.4,500 అందజేశారు. అలాగే ద్వితీయ, తృతీయ బహుతులుగా రూ.3వేలు, రూ.2వేలు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

కాలుష్య రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దుదాం



మానవహారంగా ఏర్పడి కాలుష్యం గురించి తెలుసుకుంటున్న విద్యార్థులు

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీని కాలుష్యం లేని పట్టణంగా తీర్చిదిద్దుదామని మున్సిపల్ కార్యాలయ సిబ్బంది విద్యార్థులకు సూచించారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ సిబ్బంది ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కాలుష్యం నివారణ, పర్యావరణ పరిరక్షణ అనే అంశాలపై విద్యార్థులకు శనివారం పాఠశాల ఆవరణలో అవగాహన కల్పించారు. కాలుష్యం లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని, అందరి సమన్వయంతోనే కాలుష్యం లేని మున్సిపాలిటీగా తీర్చిదిద్దగలుగుతామని సిబ్బంది పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది మద్దిలేటి, రమేష్, సంజీవరాజు విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

మానవపాడు: మద్యం తాగి వాహనాలు నడపరాదని ఎస్ఐ చంద్రకాంత్ తెలిపారు. శనివారం మండలంలోని శ్రీనగర్, చంద్రశేఖర్‌నగర్, కొర్విపాడు స్టేజీల్లో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు రోడ్డు నిబంధనలు తప్పకుండా పాటించాలని సూచించారు. వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణించరాదని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని తెలిపారు. రోడ్డు నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

భక్తులతో కిక్కిరిసిన ఆదిశిలా క్షేత్రం



మల్దకల్‌లో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభు లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాస మొదటి శనివారం కావడంతో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అర్చకులు మధుసూదనాచారి, రమేషాచారి, రవిచారి స్వామివారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా సద్దలోనిపల్లి కృష్ణస్వామి, పాల్వాయి అడవి ఆంజనేయస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్పస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే భక్తులకు అన్నదానం చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అర్చకులు చంద్రశేఖర్‌రావు, అరవిందరావు, నాగరాజుశర్మ, వాల్మీకి పూజారులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



కేటీదొడ్డి: మండల కేంద్రంలో ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధం అయిన విషయాన్ని తెలుసుకున్న మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సరిత తెలుసుకొని శనివారం ఘటన స్థలాన్ని పరిశీలించి బాధితులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆమె రూ. 10 వేలు, శ్రీనివాసులు రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మధుసూదన్‌బాబు, కృష్ణారెడ్డి, ఆనంద్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

గంగమ్మ తల్లికి ఆభరణం బహూకరణ



ఆభరణాన్ని ఊరగేంపుగా తీసుకెళ్తున్న గ్రామ పెద్దలు

వీపనగండ్ల: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న గంగమ్మ జాతరను పురస్కరించుకొని గంగమ్మ ఆలయంలో వెలసిన గంగమ్మ తల్లికి గ్రామస్తులు, పెద్దలు సమకూర్చిన ఆభరణాన్ని శనివారం గ్రామ రైతు కమిటీ నాయకులు అమ్మవారికి అలంకరించారు. దాదాపు రూ.60 వేలు వెచ్చించి తయారు చేయించిన 56 తులాల వెండి ఆభరణాన్ని అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రైతు కమిటీ అధ్యక్షుడు పోతుల వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ముంత కృష్ణయ్యయాదవ్, మాజీ సర్పంచ్ గంగిరెడ్డి, గ్రామ పెద్దలు ఎత్తం కృష్ణయ్య, ముంత మల్లయ్య, రవీందర్‌రెడ్డి, ఎత్తం బాలస్వామి, తెలుగు నర్సింహ, ఆవుల నారాయణ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ సంబురాలను జయప్రదం చేయండి

పాన్‌గల్: ఈనెల 7వ తేదీ నుంచి నిర్వహించే చెకుముకి సైన్స్ సంబురాలను జయప్రదం చేసేందుకు ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండల కేంద్రంలో చెకుముకి సంబురాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో శాస్త్రీయ దృక్పథం, శాస్త్ర ప్రచారం పెంపొందించడం బాధ్యతగా స్వీకరించి అవిరళ కృషి చేస్తున్న సంస్థ జన విజ్ఞాన వేదిక అన్నారు. ఈనెల 7వ తేదీన పాఠశాల స్థాయి, 21న మండల స్థాయి, 28న జిల్లా స్థాయి, డిసెంబర్ 14, 15, 16వ తేదీల్లో రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ సంబురాల్లో పాల్గొనే విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రూ. 5, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు రూ. 10 ప్రవేశ రుసుం చెల్లించాలన్నారు.

అలరించిన నటరాజ నాట్యమండలి చిన్నారులు



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని ముచ్చింతలలో త్రిదండి చినజీయర్ స్వామి తిరునక్షత్ర మహోత్సవంలో జిల్లాకు చెందిన నటరాజు నాట్యమండలి చిన్నారులు తమ నృత్యప్రదర్శనతో అలరించారు. కార్యక్రమంలో నటరాజు నాట్యమండలి గురూజీ అనూష తదితరులు పాల్గొన్నారు.

'నాయకులే అలంపూర్ అభివృద్ధికి ఆటంకం'



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

అయిజ: అలంపూర్ నియోజకవర్గంలోని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, అధికార పార్టీ ఇన్‌చార్జ్ బేషజాలకు పోయి అలంపూర్ నియోజకవర్గం అభివృద్ధిని అడ్డుకుంటున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. అటు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఇటు అధికార పార్టీ ఇన్‌చార్జ్ పనిచేయకపోవడంతో నియోజకవర్గంలోని ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో మొత్తం 14 నియోజకవర్గాల్లో 13 మంది అధికార పార్టీ ఎమ్మెల్యేలు, 14 మంది కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు ఉండి వారి వారి నియోజకవర్గాలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించుకునేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు.

పెండింగ్‌లోనే ప్రధాన సమస్యలు

ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి గద్వాలలో 300 పడకల ఆస్పత్రి, నర్సింగ్ కళాశాల, ధరూర్‌లో బీసీ మహిళా డిగ్రీ కళాశాల, గట్టులో పంచాయతీరాజ్ సబ్ డివిజన్ ఆఫీస్ ఏర్పాటు చేయించారన్నారు. కానీ అలంపూర్ నియోజకవర్గంలో ప్రధాన సమస్యలు అలాగే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నూతన మండలాల్లో జూనియర్ కళాశాలలు, కేజీబీవీలు, అలంపూర్ చౌరస్తాలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. అయిజ మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల, బాలికల జూనియర్ కళాశాల, బాలికల వసతి గృహం, జూనియర్ సివిల్ కోర్టు, నూతన ఆర్టీసీ ప్రాంగణం, బస్సు డిపో ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఉండవెల్లి మండలంలో పీహెచ్‌సీ, అలంపూర్ చౌరస్తాలో 100 పడకల ఆస్పత్రిలో కనీస మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రదీప్ కుమార్, భగత్ రెడ్డి, వెంకటేష్, లక్ష్మన్న, రామకృష్ణ, మధు, ఇబ్రహీం, లక్ష్మన్న ఆచారి, నరసింహ రామాచారి, కృష్ణ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



శైలజను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

అయిజ: మండలంలోని మేడికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని శైలజ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా శనివారం మేడికొండలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థిని శైలజను శాలువాతో సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు తిమ్మారెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 1వ తేదీ వనపర్తి జిల్లాలో నిర్వహించిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జోనల్ స్థాయి కబడ్డీ పోటీల్లో శైలజ తలపడి ఉత్తమ ప్రతిభ కనబరిచిందని తెలిపారు. ఈనెల 3, 4, 5 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లా రాచాలలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించినందుకు పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ జితేందర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గుంత



గంగిమాన్‌దొడ్డి స్టేజీ సమీపంలో రోడ్డు పక్కన ఏర్పడిన గుంత

గట్టు: మండల కేంద్రం నుంచి మల్దకల్ వెళ్లే దారిలో గంగిమాన్‌దొడ్డి స్టేజీ దాటిన తర్వాత వర్షాలకు రోడ్డు పక్కనే ఉన్న మట్టి కోతకు గురై, పెద్ద గోతి ఏర్పడింది. రాత్రి వేళ గట్టు నుంచి మల్దకల్ దారిలో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు మరో వాహనానికి దారిచ్చే క్రమంలో పొరపాటున రోడ్డు దిగితే అంతే సంగతులు. కొంతమంది వాహనదారులు పొరపాటున రోడ్డు దిగి ప్రమాదాల బారిన పడిన ఘటనలు ఉన్నాయి. రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న గుంతను పూడ్చాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పక్కన ఏర్పడిన గుంతను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాద నివారణ చిహ్నంగా.. మొక్క



మానవపాడు నుంచి గోకులపాడుకు వెళ్లే మినీ బ్రిడ్జిపై ఏర్పడిన గుంతపై ఉంచిన మొక్క

మానవపాడు: మినీ బ్రిడ్జిపై గుంతలు ఏర్పడి ప్రయాణానికి ప్రమాదకరంగా ఉందని, చాలాసార్లు అధికారులకు చెప్పినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గోకులపాడు, కొర్విపాడు, చంద్రశేఖర్‌నగర్, శ్రీనగర్, చెన్నిపాడు, మానవపాడుకు నిత్యం ఈ బ్రిడ్జి గుండా రాకపోకలు సాగిస్తుంటారు. మినీ బ్రిడ్జిపై గుంతలు ఏర్పడ్డ చోట మొక్కలను తొలగించి గుంతలలో ప్రమాద చిహ్నంగా ఉంచారు. చూసే వారికి మొక్కే పెగిందని ప్రయాణికులు ఆశ్చర్యకరంగా చూస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కాలినడకన శబరికి మాలదారులు



శబరికి కాలినడకన బయలుదేరుతున్న దీక్షాపరులు

ఆత్మకూర్: అయ్యప్పస్వామి సన్నిధికి శనివారం దీక్షాపరులు కాలినడకన పయనమయ్యారు. శనివారం ఆత్మకూర్ శివారులోని మల్లాపురం క్షేత్రంలోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో మక్తల్‌కు చెందిన గురుస్వామి అశోక్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, ఇరుముడి కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని మూలమళ్లకు చెందిన బాబు గురుస్వామి 14వ సారి కాలినడకన శబరికి బయలుదేరారు. అలాగే ఆత్మకూర్ బీసీకాలనీకి చెందిన బాబుస్వామి మొదటిసారి పాదయాత్రగా అయ్యప్ప సన్నిధికి తరలివెళ్లారు. ఈసందర్భంగా దీక్షాపరులు ఊరి చివర చెరువుకట్ట వరకు పాదయాత్రగా వెళ్తున్న వారిని సాగనంపారు. కార్యక్రమంలో బంగారు భాస్కర్, తోట రవి, బోరింగ్ ఎల్లయ్య, నర్సింహ, దివాకర్, బాలు, భరత్, జిన్నారం శ్రీను, రఘు, అనిల్, గోవర్ధన్, భక్తులు ఉన్నారు.

పూర్వ విద్యార్థి ఔదార్యం

- పాఠశాలకు రూ.2లక్షల విలువైన సామగ్రి వితరణ



మాట్లాడుతున్న పూర్వ విద్యార్థి వెంకట్రాములు

ఆత్మకూర్: తాను చదివిన పాఠశాలకు మంచి చేయాలని పరితపించిన పూర్వ విద్యార్థి.. ఉద్యోగరీత్యా ఇతర రాష్ట్రాల్లో స్థిరపడినా శనివారం పాఠశాలకు చేరుకుని రూ. రెండు లక్షల విలువ చేసే సామగ్రిని అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నాడు. 1989–90లో స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన వెంకట్రాములు ప్రస్తుతం బెంగళూరులో కెనరా బ్యాంకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా కొనసాగుతున్నారు. శనివారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకట్రాములు మాట్లాడుతూ.. తాను ఇక్కడే అసౌకర్యాల మధ్య కష్టపడి చదువుకున్నానని గుర్తుచేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన ఎందరో ఉన్నత శిఖరాలను అధిరోహించారని, విద్యార్థులు బాగా చదివి దేశం గర్వించే స్థాయికి ఎదగాలని సూచించారు. ఈసందర్భంగా ఎంఈఓలు కొండాపురం బాలరాజు, భాస్కర్‌సింగ్, జీహెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు వెంకట్రాములును ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. రూ.రెండు లక్షలతో డ్యూయల్ డెస్క్ బెంచీలు, టేబుళ్లు, కుర్చీలు, కంప్యూటర్లు, ఇతర సామగ్రిని విద్యార్థుల సౌకర్యార్థం అందజేయడంపై హర్షం వ్యక్తం చేశారు. అలాగే రిటైర్డ్ ఉపాధ్యాయులు వెంకట్రాములురావు, బాబుదేవిదాస్‌రావు, గోపాల్‌రెడ్డి ని ఘనంగా సత్కరించారు.

రూ.10 నాణేలపై అవగాహన కల్పించండి

వీపనగండ్ల: రూ.10 నాణేలను గ్రామాల్లోని కిరాణదారులు పరిగణలోకి తీసుకోకపోవడంతో పలువురు ఇబ్బందులకు గురి అవుతున్నారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో బ్యాంకు అధికారులు ఇచ్చిన రూ.10 నాణేలను వ్యాపారస్తులు తీసుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. బ్యాంకు, ప్రభుత్వ అధికారులు ఈ నాణేలపై వ్యాపారస్తులకు అవగాహన కల్పించడంతో పాటు తీసుకోవడానికి నిరాకరించిన వారిపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.